క్లుప్తంగా

భక్తుల ఇంటికి శ్రీరాముడి తలంబ్రాలు

ఆత్మకూరు : తెలంగాణ రాష్ట్రంలో భద్రాచలంలో జరుగనున్న సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవానికి వెళ్లలేని భక్తులకు తలంబ్రాలను బుక్ చేసుకునే అవకాశం ఆర్టీసీ కల్పించినట్లు డిపో మేనేజర్ వి.జ్యోత్స్న, ఏఎంటీ జ్యోత్స్న, ఆర్టీసీ ఆత్మకూరు ప్రతినిధి కేడల వేణు శుక్రవారం తెలిపారు. స్వామి వారి తలంబ్రాలు కావాలనుకునే భక్తులు 98662 54690 నంబర్‌లో సంప్రదించి రూ.150 చెల్లించి రశీదు పొందాలని కోరారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

అక్రమంగా మొరం తరలింపు

- టిప్పర్‌ను సీజ్ చేసిన పోలీసులు

పరకాల: అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు స్థానిక సీఐ క్రాంతికుమార్ తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో పెట్రోలింగ్ చేస్తుండగా రేగొండ మండలం రామగుండాలపల్లి నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసు కానిస్టేబుల్స్ శ్రీనివాస్, దేవేందర్, రాజయ్య అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మొరం త్రవ్వి పరకాలలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు టిప్పర్ యజమాని పోలెపల్లి చెన్నారెడ్డి ఒప్పుకోవడంతో టీఎస్03యూసీ 3937 నంబర్ గల టిప్పర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పశువుల షెడ్ నిర్మాణ పనుల పరిశీలన



వేలేరు : ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో నిర్మిస్తున్న పశువుల షెడ్ల నిర్మాణాలను ఎంపీడీఓ లక్ష్మీ ప్రసన్న శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువుల షెడ్ల నిర్మాణాలను నాణ్యతతో నిర్మించాలని, గడువులోగా పనులు పూర్తి చేయాలని ఉపాధి హామీ అధికారులను ఆదేశించారు. అలాగే ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో తాగునీరు, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

తండ్రి ప్రోత్సాహంతో రెండో ఉద్యోగం



ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల గ్రామానికి చెందిన పోతరాజు పవన్‌కుమార్ భగీరథలో ఏఈ ఉద్యోగం సాధించి ఇటీవల రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో నియామక పత్రం అందుకున్నాడు. ఇతను ఇది వరకే గ్రూప్–4లో ఉద్యోగం సాధించి విద్యాశాఖలో పనిచేస్తున్నాడు. తన తండ్రి ఈశ్వరయ్య ప్రోత్సాహంతో కొలువు సాధించానని పవన్‌కుమార్ పేర్కొన్నాడు. ప్రణాళికబద్ధంగా చదివితే విజయం వరిస్తుందన్నారు. రైతు కుటుంబానికి చెందిన పవన్‌కుమార్ ఏఈ ఉద్యోగం సాధించడంపై మండలానికి చెందిన పలువురు అభినందించారు.

రైల్వే సబ్ డివిజన్ ఆస్పత్రిని ప్రారంభించాలి



కాజీపేట రూరల్: కాజీపేటలో ఆధునిక సౌకర్యాలతో నూతనంగా నిర్మించిన కాజీపేట సబ్ డివిజన్ రైల్వే ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ కోరారు. ఈమేరకు రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆకుల శ్రీకాంత్ పటేల్, తోపుచర్ల మధుసూదన్‌రావు, ఎండి.చాంద్‌పాషా, కాయిత రాజ్‌కుమార్ యాదవ్, భగవాన్ ఉపాధ్యాయ, గందసిరి శ్రీకాంత్, శ్రావణ్‌యాదవ్, రేణుకుంట్ల కల్యాణ్, జరీనా పాల్గొన్నారు.

రైల్వే సంఘ్ నేతల వినతి

కాజీపేటలో పెండింగ్‌లో ఉన్న లోకోపైలట్ల రిక్వెస్ట్ బదిలీలను వెంటనే అమలు చేయాలని, కాజీపేట డిపో సామర్థ్యం పెంచాలని, క్రూ బీట్లను పునఃపరిశీలించాలని, ఎంఏసీపీఎస్‌ను అమలు చేయాలని, అలవెన్స్‌లను అమలు చేయాలని కోరారు. ఈమేరకు రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కాజీపేట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ లోకోరన్నింగ్ బ్రాంచ్ వర్కింగ్ చైర్మన్ పాక రాజ్‌కుమార్, గుప్తా, లక్ష్మీనారాయణ, పరమేశం, అజీజ్‌పాషా, నర్సింగరావు, ముస్తాక్ విజ్ఞప్తి చేశారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

పరకాల: పదో తరగతి వార్షిక పరీక్షలు మొదటి రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. పరకాలలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 545 మంది విద్యార్థులు సోషల్ వేల్ఫేర్ (మాతృశ్రీ)లో 200 మంది, సోషల్ వేల్ఫేర్(మల్లక్‌పేట)లో 200 మంది విద్యార్థులు, పరకాల ఉన్నత పాఠశాలలో 145 మంది విద్యార్థులు 100 శాతం హాజరయ్యారు. మాస్‌కాపీయింగ్ జరుగకుండా సీఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎల్కతుర్తి : ఎల్కతుర్తిలో రెండు సెంటర్లకు గాను 351 మంది విద్యార్థులకు గాను వందశాతం మంది హాజరైనట్లు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో రెండు సెంటర్లకు గాను 352 మందికి వందశాతం మంది హాజరైనట్లు ఎంఈఓ సునీతారాణి తెలిపారు. ఎల్కతుర్తి మోడల్ పాఠశాల సెంటర్ వద్ద కాంగ్రెస్ నాయకులు విద్యార్థులకు పెన్నులు అందజేశారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ హైస్కూల్, సెయింట్ థెరిస్సా హైస్కూల్ సెంటర్‌లో 650 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి పర్యవేక్షించారు.

శాయంపేట : తెలుగు పరీక్షకు బాలికల పాఠశాలలో 150, ఎంజేపీ పాఠశాల సెంటర్‌లో 148 మొత్తం 298 మంది వంద శాతం హాజరైనట్లు ఎంఈఓ భిక్షపతి తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంఈఓ భిక్షపతి, ఎంపీడీఓ ఫణిచంద్ర పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎస్సై జక్కుల పరమేష్ పోలీస్ సిబ్బందితో ఎలాంటి మాస్‌కాపీ జరుగకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.

వేలేరు : మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఎంఈఓ చంద్రమౌళి తెలిపారు. వేలేరు హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రంలో 150 మంది, సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలలో 132 మంది మొత్తం 282 విద్యార్థులు హజరయ్యారు. పరీక్షలు జరుగుతున్న తీరును తహసీల్దార్ హెచ్.కోమి పరిశీలించారు. ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా వేలేరు హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రంలో విద్యార్థులు అసౌకర్యాల మధ్యనే పరీక్షలు రాశారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో రోడ్డు వైపు పరదాలను ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు.

దామెర : మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ లకవత్ రాజేష్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 223 మందికి గాను 223 మంది వంద శాతం హాజరైనట్లు ఆయన తెలిపారు. ఎస్సై అశోక్ బందోబస్తు నిర్వహించారు.



ముల్కనూరులో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కమలాపూర్ : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 200 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 142 మంది, తెలంగాణ మోడల్ స్కూల్‌లో 180 మంది, శనిగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 98 మంది విద్యార్థులు చొప్పున నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు జరిగిన తెలుగు పరీక్షకు మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాల్లో 620 మంది విద్యార్థులకు 619 మంది విద్యార్థులు హాజరయ్యారు. కమలాపూర్ బాలుర పాఠశాలలో ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు ఎంఈఓ కె.శ్రీధర్, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు తెలిపారు.

పటిష్ట బందోబస్తు మధ్య పరీక్షల నిర్వహణ..

రెండేళ్ల క్రితం పదో తరగతి పరీక్షల సందర్భంగా కమలాపూర్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి హిందీ ప్రశ్నపత్రం లీకైన నేపథ్యంలో ఈ ఏడాది పరీక్షల నిర్వహణకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. సీఐ హరికృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నాలుగు పరీక్షా కేంద్రాలు తిరుగుతూ సీఐ బందోబస్తును పర్యవేక్షించారు.



దామెర : విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష హాల్‌లోకి పంపిస్తున్న ఇన్విజిలేటర్లు



శాయంపేట : విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి పంపిస్తున్న ఇన్విజిలేటర్లు



పరకాల : పరీక్ష హాల్‌లోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు



పరకాల: నోటీస్ బోర్డుపై హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు



శాయంపేట : సెంటర్ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై పరమేశ్, సిబ్బంది



వేలేరు : హైస్కూల్‌కు ప్రహరీ లేకపోవడంతో పరదాలు కట్టి పరీక్షలు నిర్వహించిన అధికారులు



ఎల్కతుర్తి : పరీక్ష హాల్‌కు వెళ్తున్న విద్యార్థులు

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

- డీఈ సామ్యానాయక్

దామెర : మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్లలో ప్రజలకు విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ పనిచేస్తుందని హనుమకొండ రూరల్ డీఈ బి.సామ్యానాయక్ అన్నారు. శుక్రవారం 33/11కేవీ సబ్ స్టేషన్‌లో సమ్మర్ యాక్షన్‌లో భాగంగా దామెర రూరల్ ఫీడర్ నుంచి దామెర టౌన్ ఫీడర్‌ను వేరు చేసి ప్రత్యేక బ్రేకర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామాల్లో ఉండే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు వాటరింగ్ చేసే ఎర్తింగ్ సరిగా ఉండేలా చూడాలన్నారు. విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని, ఆటోమెటిక్ స్టార్టర్లను వాడరాదని సూచించారు. ఎవరూ అక్రమంగా విద్యుత్ వాడరాదని, ఎవరికైనా విద్యుత్ సమస్యలు ఉంటే విద్యుత్ సిబ్బందికి తెలుపాలని అన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పరకాల ఏడీఈ దేవేందర్, ఏఈ గుర్రం రమేష్, ఎల్‌ఎంలు మనోహర్, రవీందర్, రాజశేఖర్, వేణు, పాల్గొన్నారు.



బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఏడీ సామ్యానాయక్

మంద కృష్ణ పోరాట ఫలితమే వర్గీకరణ



సీఎం రేవంత్‌రెడ్డి, మంద కృష్ణ మాదిగల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వేలేరు : మంద కృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాట ఫలితమే ఎస్సీల వర్గీకరణ అని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మనోజ్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేపట్టారని అన్నారు. వర్గీకరణ కోసం ఎంతోమంది మాదిగ బిడ్డలు ప్రాణత్యాగాలు చేసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజయ్య, యేసు, శంకర్ ,ధర్మేందర్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్, ప్రశాంత్, సలీం మాలీక్, ఆరీఫ్, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎర్త్ అవర్ పోస్టర్ ఆవిష్కరణ

శాయంపేట : తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సత్యనారాయణ ఎర్త్ అవర్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్త్ అవర్ అనేది ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించే వాతావరణ దినోత్సవమని తెలిపారు. గ్లోబల్ వార్మింగ్ కారణంగా జీవరాశి ఉనికి ప్రశ్నార్థకంగా మారడంతో భూమిని కాపాడుకుందాం, పర్యావరణాన్ని రక్షించుకుందామని ప్రపంచ పర్యావరణవేత్తలు ఎర్త్ అవర్‌ను ప్రపంచ వ్యాప్తంగా ఒక గంటసేపు విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. నేడు (శనివారం) సాయంత్రం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు మండల వ్యాప్తంగా విద్యుత్ వినియోగాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి ప్రతి ఇంటిలో స్విచ్ ఆఫ్ చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రజ్వల్ సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

గురుకులాలను సందర్శించిన విద్యార్థులు

కమలాపూర్ : మండలంలోని అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్ కార్యక్రమంలో భాగంగా కమలాపూర్‌లోని ఎంజేపీ బాలుర, బాలికల గురుకుల పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గురుకుల పాఠశాలల్లోని సైన్స్‌ల్యాబ్, క్లాస్ రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, డైనింగ్ హాల్, పాఠశాల పరిసరాలను పరిశీలించి పలు విషయాలు తెలుసుకున్నారు. వారి వెంట మండల విద్యాధికారి కె.శ్రీధర్, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థులు ఉన్నారు.



ఎంజేపీ గురుకుల పాఠశాల సందర్శనలో విద్యార్థులు

వేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు

- పైలెట్ ప్రాజెక్టు గ్రామంలో ప్రారంభం
- మండల కేంద్రంలో స్థలం లేక నిర్మించని ఇందిరమ్మ మోడల్ ఇళ్లు

వేలేరు : ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా జనవరి 26న రాష్ట్ర ప్రభుత్వం మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఆయా పథకాలను మంజూరు చేశారు. మండలంలోని శాలపల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అర్హులైన 85 మందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. గ్రామంలో గృహనిర్మాణ శాఖ అధికారులు, ఎంపీడీఓ కలిసి ఎంపికైన లబ్ధిదారులతో సమావేశమై ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పించారు. సొంత స్థలము ఉన్న లబ్ధిదారులను ముందుగా ఎంపిక చేసి పనులు ప్రారంభించారు. గ్రామంలో ఇప్పటి వరకు 25 మంది పనులు ప్రారంభించగా కొంతమంది ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌కు చేరుకున్నాయి. మరికొంత మంది లబ్ధిదారులు త్వరలోనే ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే గ్రామంలో మొత్తం 85 మందికి కొత్త రేషన్ కార్డులు, 22 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 100 శాతం రైతు భరోసా డబ్బులు అకౌంట్‌లో జమయ్యాయి. కాగా శాలపల్లి గ్రామం మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బేస్‌మెంట్ లెవల్‌కు చేరుకున్న ఇంటి నిర్మాణాలు

పోషకాల నిర్వహణతో అధిక దిగుబడి

కమలాపూర్ : మామిడి తోటల సాగులో నీటి యాజమాన్యం, పోషకాల నిర్వహణ, పురుగుల నియంత్రణ ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పరకాల డివిజన్ ఉద్యానశాఖ అధికారి టి.మధులిక శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. వాతావరణ మార్పులు మామిడి తోటలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నందున మామిడి తోటలకు ప్రతిరోజు ఉదయం గంటన్నర, సాయంత్రం గంటన్నర పాటు నీటిని డ్రిప్ ద్వారా అందించాలన్నారు. తద్వారా తేమ శాతం తగ్గకుండా, చెట్లు ఒత్తిడికి గురికాకుండా ఉంటాయన్నారు. ఎరువుల యాజమాన్యం విషయానికొస్తే పదేళ్ల వయసు గల మొక్కలకు 500 గ్రాముల యూరియా, 500 గ్రాముల పొటాషియం అందించాలని, తద్వారా కాయ పెరుగుదలతో పాటు కాయల్లో నాణ్యత ఉంటుందన్నారు. చీడపీడల విషయానికొస్తే తామర పురుగులు, కాయతొలుచు పురుగులు ఎక్కువగా కనిపిస్తాయని, తామర పురుగుల నివారణ కోసం లీటరు నీటిలో 2 మిల్లీలీటర్ల ఫిప్రోనిల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. కాయ తొలుచు పురుగు నివారణ కోసం 200 లీటర్ల నీటిలో 40 గ్రాముల 80 డబ్ల్యూజీ ఫిబ్రోనిల్, 500 మిల్లీలీటర్ల ఆర్తో సాలిసిలిక్ ఆమ్లం కలిపి పిచికారీ చేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం 8977714069 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన అవసరం

- మండల వైద్యాధికారి గోపీనాథ్

ధర్మసాగర్: టీబీ వ్యాధిపై ప్రజలందరికీ అవగాహన అవసరమని మండల వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ–2025 కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలందరికీ అవగాహన కలిగి ఉండాలని, క్షయ వ్యాధిని నిర్మూలించడంలో ప్రజలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం పూట జ్వరం రావడం, బరువు తగ్గిపోవడం, ఆకలి తగ్గిపోవడం లాంటి లక్షణాలు ఉన్నట్లయితే వారు వెంటనే దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెమడ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయినట్లయితే టీబీ మందులు ఆశా వర్కర్ల ద్వారా ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. టీబీ మందులు వాడుతున్న వారికి పోషకాహార సహాయం కింద నెలకు రూ.1000 చొప్పున ఆరు నెలల కాలానికి అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యప్రకాష్, కరుణాకర్, జాతీయ టీబీ నివారణ విభాగం సిబ్బంది సతీష్ కుమార్, కోఆర్డినేటర్ దూడం నగేష్, ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ గోపీనాథ్

'బడ్జెట్‌లో బీసీలకు తీరని అన్యాయం'

కాజీపేట: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ కులాలకు సరైన న్యాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు అలకుంట్ల ఎల్లయ్య విమర్శించారు. పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన బీసీలకు రూ.20 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆంధ్ర రాష్ట్రంలో రూ.47,456 కోట్లు కేటాయించిన విషయాన్ని కాంగ్రెస్ పాలకులు గుర్తించాలని సూచించారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీ మండల కమిటీ ఎన్నిక

ఐనవోలు : మండల ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పంథిని గ్రామానికి చెందిన చిర్ర శ్రీనివాస్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో సమావేశమైన ఆర్‌ఎంపీ, పీఎంపీలు సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఏ.రాజేశ్వర్‌రావు, గౌరవ అధ్యక్షుడిగా బి. సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రవికుమార్, కోశాధికారిగా టి.రాజు, ప్రచార కార్యదర్శిగా కె.నాగరాజు, సహాయ కార్యదర్శిగా వై. వెంకటేశ్వర్లు, ముఖ్య సలహాదారులుగా టి. యాకాంతం, వై ఉపేందర్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.



నూతన ఎన్నికైన కమిటీ సభ్యులు